ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
ఆదివారం | 23 ఫిబ్రవరి, 2025 | పేజీలు : 6

## ఆడపిల్లలు అన్ని రంగాలలో రాణించాలి




**ప్రజాపక్షం/చండూరు:** ఆడపిల్లలు చదువుతోపాటు అన్ని రంగాలలో రాణించాలని సిఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చెల్లం పాండురంగారావు అన్నారు. శనివారం చండూరులోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో సిఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముద్రించబడిన పదవ తరగతి స్టడీ మెటీరియల్ ను ఫౌండేషన్ చైర్మన్ చెల్లం పాండురంగారావు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఆర్ఆర్ ఫౌండేషన్ ప్రభుత్వ పాఠశాలలతో పాటు గురుకుల పాఠశాలలు , కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో పదవ తరగతి చదివే విద్యార్థులందరికి రాష్ట్ర స్థాయి విషయ నిపుణులచే తయారు చేయబడిన సులభమైన పద్ధతిలో ఉండే విధంగా రూపొందించబడిన స్టడీమెటీరియల్‌ను అందించడం జరుగుతుందని అన్నారు. విద్యార్థులందరూ ఈ స్టడీమెటీరియల్‌ను మంచిగా చదివి సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్ఓ మంజుల , సివిల్ ఇంజనీర్ భూతరాజు ధనలక్ష్మి , పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# లింకు రోడ్లు 60ఫీట్ల వెడల్పు

### భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా రోడ్డు నిర్మాణాలు

### చండూరులో నిర్మిస్తున్న రోడ్డు పనులను పరిశీలించిన ఎంఎల్ఎ రాజగోపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/చండూరు:** చండూరు మున్సిపాలిటీలో నిర్మిస్తున్న ప్రధాన రహదారి నిర్మాణ పనులను మునుగోడు ఎంఎల్ఎ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి శనివారం పరిశీలించి సంబంధిత కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేసి త్వరితగతిన రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని అన్నారు. రోడ్ వెడల్పు పనుల్లో భాగంగా రోడ్ మధ్యలో ఉన్న విధ్యుత్ స్తంభాలను తొలిగించాలని ఆదేశించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని చండూరు మున్సిపాలిటీ పట్టణం ప్రధాన రహదారి కి వివిధ గ్రామాల నుండి వచ్చే లింక్ రోడ్లను చండూరు మున్సిపాలిటీ పరిధి వరకు 60ఫీట్ల వెడల్పు రోడ్ గా మార్చాలని అన్నారు. దానికి సంబంధించి ప్రతిపాధనలు సిద్ధం చేయాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ముఖ్యంగా చండూరు పట్టణ సెంటర్‌లో వాణిజ్య సముదాల భవనాల వద్ద రోడ్ వెడల్పు ప్రాసెస్ ఎంత వరకు వచ్చిందో పరిశీలించారు. చండూరు బస్టాండ్ నుండి కనగల్లు వైపు శివారు ప్రాంతం వరకు చేపట్టిన రోడ్ డివైడర్ పనులను పరిశీలించి పలుమార్పులను సూచించారు. రోడ్ డివైడర్ మధ్యలో పచ్చగడ్డి లాన్ తో పాటు అందమైన చెట్లను పెంచే విధంగా నిర్మాణం జరగాలన్నారు. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా రోడ్ వెడల్పు పనులతో పాటు ఇతర మౌళిక సదుపాయాలను కల్పించి చండూరు పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతానని ఎంఎల్ఎ రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కంట్రాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రేస్ పార్టీ చండూరు మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్‌గౌడ్, కాంగ్రేస్ పార్టీ చండూరు మండల అధ్యక్షుడు కొరిమి ఓంకారం, పార్టీ జిల్లా నాయకుడు , ట్రస్మా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కోడి శ్రీనివాసులు , దోటి వెంకటేశ్ యాదవ్, నల్లగంటి మల్లేశం , భీమనపల్లి శేఖర్ , మంచుకొండ సంజయ్ , ఇరిగి వెంకటేశం , కలిమికొండ జనార్ధన్ , కోడి గిరిబాబు, రాంమూర్తి, బోయపల్లి సైదులు, ఇరిగి రాజు, రాములు, బిక్షం పాల్గొన్నారు.



## ఉమ్మడి గురుకులాల ప్రవేశ పరీక్షకు ఏర్పాటు పూర్తి

**ప్రజాపక్షం/మునుగోడు:** ఈనెల 23న జరగనున్న తెలంగాణ రాష్ట్ర గురుకులాల ఉమ్మడి ప్రవేశ పరీక్ష రాసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మునుగోడు జ్యోతిబాపూలే బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్యారాణి శనివారం తెలిపారు. శనివారం మునుగోడు మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబా పూలే బాలికల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశాలతో పాటు 6 నుండి 9 తరగతి వరకు ఖాళీల భర్తీ కోసం నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఉదయం 9.30 గంటలకు పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకోవాలని సూచించారు .పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు పరీక్ష ఫ్రాడ్ ,బ్లూ, బ్లాక్ పెన్, పెన్సిల్, లబ్బర్, ఆధార్ కార్డ్, హాల్ టికెట్ తప్పనిసరిగా తీసుకొని రావాలన్నారు. నిమిషం ఆలస్యమైన పరీక్షకు అనుమతి లేదని విద్యార్థిని విద్యార్థులు సమయపాలన పాటించి సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు.

**ప్రజాపక్షం/నందికొండ:** నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో నేడు రాష్ట్ర వ్యాప్తంగా ఐదవ తరగతిలో ప్రవేశానికి నిర్వహిస్తున్న ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపల్ రాజశేఖర్ తెలిపారు.ఆదివారం ఉదయం నిర్వహించనున్న ఈ ప్రవేశ పరీక్షకు మొత్తం 240 విద్యార్థులు పోటీ పడనున్నట్లు మొత్తం 12 క్లాస్ రూమ్స్ లో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఒక్కొక్క క్లాసుకి 20 మంది చొప్పున విద్యార్థులను కేటాయించడం జరిగిందని ఆయన అన్నారు.

## పూల రవీందర్‌ను గెలిపించాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట:** వరంగల్‌ఖమ్మం నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిసిల వాణిని చట్టసభల్లో వినిపించేందుకు పూల రవీందర్‌కు ఉపాధ్యాయులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మాజీ ఐఎఎస్, బిసి ఇంటలెక్చువల్స్ ఫోరం అధ్యక్షులు టి చిరంజీవులు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జివివి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిసివాదాన్ని గెలిపించేందుకు బిసి, బహుజన ఉపాధ్యాయులు ఐక్యం కావాలని కోరారు. బిసిలు రాజ్యాధికారం చేపడితేనే రానున్న రోజుల్లో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. అగ్రకులాల పాలనలో బిసిలు విద్యా, ఉద్యోగ రంగాలతో పాటు మిగతా రంగాల్లో కూడా నష్టపోయారని చెప్పారు. చట్టసభలు, స్థానిక సంస్థల్లో బిసిలకు జనాభా ప్రాతిపదికన ఫలాలు అందాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టిపిటియు రాష్ట్ర అధ్యక్షులు మట్టిపెల్లి రాధాకృష్ణ, మోడల్ స్కూల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బూతం యాకమల్లు, విశ్రాంత ఉపాధ్యాయులు దశరథ రామారావు, గాలి మురళి, బుల్లెదు వెంకటేశ్వర్లు, అనంతుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.




## చందంపేట తహసీల్దార్ కార్యాలయంలో

# పరిమితికి మించి అనుమతులు?

### తహసీల్దార్‌కు తెలియకుండా డిప్యూటీ తహశీల్దార్ అనుమతులు....

### తెలియక అనుమతి ఇచ్చానని సమాధానం చెబుతున్న అధికారి

### తహసీల్దార్ జోక్యంతో ట్రాక్టర్లు ఆపిన వైనం..





**ప్రజాపక్షం/చందంపేట :** నల్గొండ జిల్లా చందంపేట మండలంలో చేతులు తడిపితే చాలు స్వేచ్ఛగా సంతకాలు చేస్తున్న మండల డిప్యూటి తహశీల్దార్ గోవర్ధన్ రెడ్డి. మండల తహశీల్దార్ శ్రీనివాస్ ఈనెల 03వ తేదిన సెలవులపై వెళ్లి తిరిగి ఈనెల 13వ తేదిన రావడం జరిగింది. తహశీల్దార్ సెలవులలో ఉన్న సమయంలో తహశీల్దార్‌గా బాధ్యతలు తీసుకొని కొంత మంది కాంట్రాక్టర్లు ఇసుక అనుమతి ఇవ్వాలని కోరగా వెంటనే వారికి ఈనెల 19 నుండి 28వ తేది వరకు ఇసుకు రవాణాకు అనుమతులు ఇవ్వడం జరిగింది. వాస్తవానికి మండల తహశీల్దార్ ఎక్కడా కూడా ఇసుక పర్మిషన్ ఇవ్వకూడదని తెలిపినప్పటికి తహశీల్దార్‌కు తెలపకుండా పర్మిషన్లు ఇవ్వడంతో శనివారం విషయం తెలుసుకున్న తహశీల్దార్ డిప్యూటి తహశీల్దార్ గోవర్ధన్‌రెడ్డిని వివరణ అడగగా సమాధానం చెప్పకపోవడంతో తక్షణమే తహశీల్దార్ శ్రీనివాస్ దేవరకొండ ఆర్డివోకు సమాచారం ఇవ్వడం జరిగింది. ఆ గ్రామాలలో కొంత మంది వచ్చి ఇండ్లు కట్టుకోవడానికి కూడా పర్మిషన్ ఇవ్వాలని కాంటాక్ట్ చేసుకునే వారికే ఇసుక అనుమతి ఇవ్వడం జరిగిందని కొరట్ల గ్రామం నుండి హంక్యతండా బిటి రోడ్డుకు ఇచ్చాని వెంటనే ఇచ్చిన అనుమతిని రిటర్న్ తీసుకోవాలని ఆర్డివో చెప్పారని గతంలో ఎన్నడూ కూడా ఈ విధంగా జరగలేదని మరళ కూడా ఎక్కడైనా ఇసుక అక్రమంగా తరలిస్తే మాకు కూడా సమాచారం ఇవ్వాలని వారిపై అధికారులు తప్పకుండా చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఇంకా మండలంలోని ఏ గ్రామానికి అయిన అక్రమంగా అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే పోలీసు అధికారులకు, మండల అధికారులకు సమాచారం తెలపాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్లు పేదలకు కట్టిస్తున్న తరుణంలో ఇసుకను ఎక్కడ కూడా అక్రమంగా తరలించేది లేదని అన్నారు.



## గురుకుల ప్రవేశ పరీక్షలల్లో ఉత్తమ ర్యాంకులు సాధించాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట(పెన్‌పహాడ్):** నేడు(ఆదివారం) జరిగే గురుకుల ప్రవేశ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించాలని అరబిందో మాత ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రిన్సిపల్ షేక్ మస్తాన్ అన్నారు. శనివారం మండల పరిధిలోని అనంతారం గ్రామంలోని అరబిందో మాత ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు గురుకుల ప్రవేశ పరీక్షలకు శిక్షణ పొందిన విద్యార్థులకు హాల్‌టికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించి పాఠశాల, తమ తల్లిదండ్రులు, గ్రామానికి పేరు ప్రఖ్యాతలు తీసుకరావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చిట్యాలలో కవలల దినోత్సవం



**ప్రజాపక్షం/చిట్యాలః** నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటిలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో శనివారం రోజున జాతీయ కవలల దినోత్సవాన్ని జరుపుకున్నారు. పాఠశాలలోని కవల విద్యార్థులను సహచర విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు. పాఠశాల ప్రిన్సిపల్ పెద్ది నరేందర్ ఈ సందర్భంగా వారికి కథల పుస్తకాలు, స్వీట్స్‌ను అందజేశారు. కవలలను అభినందించిన వారిలో ఉపాధ్యాయ బృందం సభ్యులు బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పెద్ది పద్మ, షేక్ షమీమున్నీసా బేగం, ఆసియా, ఎం ధనలక్ష్మి, ఎస్ జ్యోతి, పి స్వాతి, పి రమాదేవి, ఎం మాధవి, జుబీదా, కె మౌనిక, సిహెచ్ ప్రసన్న, ఎస్ కీర్తి, బి కన్నయ్య, బి స్వప్న, జె శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఎన్‌వీఆర్ ఫౌండేషన్ గేమ్స్‌లో శాస్త్ర విద్యార్థుల ప్రతిభ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఎన్‌వీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో అండర్14 విభాగంలో పట్టణంలోని శాస్త్ర పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించినట్లు, అదేవిధంగా అండర్ 17 విభాగంలో తమ పాఠశాల ప్రథమ బహుమతి సాధించినట్లు పాఠశాల స్కూల్ ఛైర్మన్ ఎం.చంద్రశేఖర్, కరస్పాండెంట్ పి.శ్రీధర్‌రెడ్డిలు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఎన్‌వీఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ నూకల వేణుగోపాల్‌రెడ్డి విద్యార్థులకు బహుమతులు అందచేసి మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించినట్లయితే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను మాజీ కౌన్సిలర్లు రుణాల్‌రెడ్డి, రామకృష్ణ, రవినాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## అవగాహనరాహిత్యంతో కోళ్లను చంపుకోవద్దు



**ప్రజాపక్షం/అనంతగిరి:** కోళ్ల పెంపకం దారులు అవగాహన రాహిత్యంతో కోళ్లను చంపుకోవద్దని పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.పెంటయ్య అన్నారు. శనివారం అనంతగిరి మండల పరిధిలోని కిష్టాపురం గ్రామంలో వెంకన్న కోళ్ల ఫారంలో కోళ్లు చనిపోవడం సమాచారం మేరకు వాటిని పరిశీలించారు. వెంకన్న సొంత పొలంలో ఏ కంపెనీకి సంబంధం లేకుండా స్వంతంగా వేయి బ్రాయిలర్ కోళ్ల ఫారం నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం రెండు నుండి మూడు కిలోల బరువు ఉన్న కోళ్లు అమ్మకానికి సిద్ధమయ్యాయి. పక్క రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ నేపథ్యంలో గత పది రోజులుగా తనవద్ద రెగ్యూలర్ క ఓళ్లను తీసుకువెళ్లే వ్యాపారి బయట కోడి మాంసానికి డిమాండ్ తగ్గిందనే నేపంతో కోళ్లను కొనడంలేదని, ఇప్పటికే మార్కెట్ ధర పడిపోయిందని, ఇంకా మేపితే తనకు దాణాఖర్చు అదనమై ఇంకా నష్టపోతారని మార్కెట్‌పై అవగాహన లేక కొన్ని రోజులుగా కోళ్లకు దాణ, నీరు ఇవ్వడంలేదని వెంకన్న ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో స్పందించిన డాక్టర్ పెంటయ్య మాట్లాడుతూ ఈ కోళ్లఫారంలోని కోళ్లన్ని ఆరోగ్యంగా ఉన్నాయని, ఉన్నతాధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా మార్కెటింగ్‌కు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మన రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ లేదని, పక్క రాష్ట్రంలో ఉందని, అందుకే మన రాష్ట్రానికి రాకుండా 24 చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని అన్నారు. కోళ్ల ఫారం యాజమానులు ఎవరు భయాందోళనలు చెందవద్దని సూచించారు. పశువైద్య సిబ్బంది ఉన్నారు.

## స్టీల్ రైలింగ్ ఇండస్ట్రీస్ ప్రారంభం



ప్రజాపక్షం/సూర్యాపేట: జిల్లా కేంద్రంలో వినియోగదారుల అభిరుచికి తగ్గట్లుగా స్టీల్ రైలింగ్ ఇండస్ట్రీస్‌ను ప్రారంభించడం అభినందనీయమని ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి, టిపిసిసి సభ్యులు, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డిలు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్ రోడ్డులో ఆరిఫ్ మెటల్ అండ్ స్టీల్ ఫ్యాబ్రికేషన్ వర్క్స్ ఇండస్ట్రీస్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం బజారుకు చెందిన ఆరిఫ్ జీవితంలో ఎంతో కష్టపడి నేడు స్టీల్ రైలింగ్ ఇండస్ట్రీస్ ప్రారంభించాడని చెప్పారు. 40 ఏళ్ళ అనుభవంతో ప్రజల అభిరుచులకు అనుగుణంగా నమ్మకం, నాణ్యతతో సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పొలగాని బాలు గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ ఎలిమినేటి అభినయ్, నిర్వహకులు ఆరిఫొద్దీన్, ఆర్గనైజర్ షేక్ అహ్మద్ అలీ, మీరా బాష, కమురుద్దీన్, దండ వెంకట్ రెడ్డి, సత్యనారాయణరెడ్డి, అబ్దుల్లా పాల్గొన్నారు.

## మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** ఈనెల 27న జరిగే వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని స్వతంత్ర అభ్యర్థి సుందర్ రాజ్ యాదవ్ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలో మాజీ డిసిఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్ ఆధ్వర్యంలో బిసి సంఘాలతో కలిసి తమకు ఓటు వేసి గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై తమకు సపూర్ణ అవగాహన ఉందని, వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. బిసి నాయకుడు వట్టె జానయ్య యాదవ్ మాట్లాడుతూ బిసి సంఘాలు బలపరచిన సుందర్ రాజ్ యాదవ్‌కు ప్రతి బిసి ఉపాధ్యాయులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి మన బలాన్ని చూపించాలని కోరారు. శాసన మండలిలో బిసి గొంతుకను వినిపించేందుకు చట్టసభకు ఆయనను పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తూము వెంకన్న, బయ్య మల్లికార్జున్, మన్నెం యాదగిరి, మాచనపల్లి లింగయ్య, బడుగుల శ్రీనివాస్ యాదవ్, మన్నెం మురళి, లింగస్వామి, నాగేశ్వర్ రావు పాల్గొన్నారు.

## ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలో శిష్య పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సీఎంగా, మినిస్టర్లుగా, ఆఫీసర్లుగా, హెచ్ఎంగా, ఉపాధ్యాయులుగా పాత్రలను పోషించి చక్కటి ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ అలుగుబెల్లి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించి విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను, నాయకత్వ లక్షణాలను బయటకు తీసే విధంగా కృషి చేస్తున్నామన్నారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. పాఠశాల కరస్పాండెంట్ అలుగుబెల్లి శిరీష, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## నేరుగా విత్తే వరిసాగు యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం

**ప్రజాపక్షం/మునగాల:** వరిలో డ్రంసీడర్, వెదజల్లే పద్ధతులలో (నేరుగా విత్తే వరిసాగు)తో ఎక్కువ అధిక దిగుబడులు పొందవచ్చునని కెవికె గడ్డిపల్లి శాస్త్రవేత్త డి. నరేష్ తెలిపారు. శనివారం మండలంలోని మాదవరం గ్రామంలో ఐసిఎఆర్ భారతీయ వరి పరిశోధన సంస్థ, రాజేంద్రనగర్ ఆధ్వర్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిఎస్ఆర్ ఫండ్ సహకారంతో నేరుగా విత్తే పద్ధతి వరిసాగుపై చేసే రైతులకు వరిలో డ్రం సీడర్, వెదజల్లే పద్ధతుల వరిలో డ్రోన్ ద్వారా కలుపు మందు పిచికారిపై శిక్షణ కల్పించారు. చీడ పీడల సమస్య, నీటి యాజమాన్య పద్ధతులు, కలుపు యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరించారు. నేరుగా వరి విత్తనం ద్వారా కూలీల సమస్యను అధిగమించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు ఎం.కిరణ్, మండల వ్యవసాయశాఖ అధికారి బి.రాజు, అధికారులు సంతోష్, వ్యవసాయ రైతు అరవింద్, సురేందర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, సత్యనారాయణ, దిలీఫ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జగదీష్‌రెడ్డిని తరిమేసే రోజులు దగ్గరలోనే ఉన్నాయి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** ఆంధ్రప్రదేశ్ సిఎం నారా చంద్రబాబు నాయుడును తెలంగాణ నుండి తరిమేస్తామని మాజీ మంత్రి జగదీష్ రెడ్డి చేసిన వాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు నాతాల రాంరెడ్డి అన్నారు. సూర్యాపేట నుండి మాజీ మంత్రి జగదీష్ రెడ్డిని తరిమేసే రోజులు దగ్గరలోనే ఉన్నాయని చెప్పారు. శనివారం జిల్లా కేంద్రంలోని వాణిజ్యభవన్ సెంటర్‌లో ధర్నా నిర్వహించి జగదీష్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుంగతుర్తి నియోజకవర్గం నాగారం నుండి వచ్చిన జగదీష్ రెడ్డిని సూర్యాపేట ప్రజలు మూడుసార్లు గెలిపించి పదెళ్ళు మంత్రిని చేసిన విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని సూచించారు. చంద్రబాబునాయుడుపై ఆయన చేసిన వాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు వెంకన్న నాయక్, రవి నాయక్, శెట్టిపల్లి సైదులు, లింగయ్య, వెంకన్న, గోవిందాచారి, వీరారెడ్డి, సోమిరెడ్డి పాల్గొన్నారు.

## స్టడీ మెటీరియల్స్ అందజేత

**ప్రజాపక్షం/చిట్యాలః** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన కస్తూరి ఫౌండేషన్ వారు శనివారం స్టడీ మెటీరియల్స్‌ను అందజేశారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మండల విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పానుగోతు సైదానాయక్ విద్యార్థులకు మెటీరియల్స్‌ను అందజేసిన అనంతరం మాట్లాడుతూ మార్చి 21 నుండి ప్రారంభమయ్యే పది పరీక్షలకు విద్యార్థులు సిద్ధం కావాలని, సమయం తక్కువగా ఉన్నందున చదువుపై పూర్తి శ్రద్ధ వహించి ఉత్తమమైన మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం కస్తూరి ఫౌండేషన్ వారు చేస్తున్న సేవలను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులతోపాటు ఉపాధ్యాయులు భూపాల్‌రెడ్డి, బాలకృష్ణ, బాలయ్య, నయీముద్దీన్, అష్రాఫ్ అలి, మాధవి, సాయిబాబా, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.





## చిట్యాలలో ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారం

**ప్రజాపక్షం/చిట్యాలః** విద్యావంతులైన ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఓటర్లు బిజెపి అభ్యర్థి పులి సరోత్తం రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎంఎల్‌సి ఎన్నికల నకిరేకల్ నియోజకవర్గ ఇంఛార్జ్ ఆకుల వాణి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటి కేంద్రంలో శనివారం ఆమె స్థానిక బిజెపి నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టిన సందర్భంగా ఓటర్లతో మాట్లాడుతూ దేశంలో బిజెపి సుస్థిర పాలనను అందిస్తుందని, దేశ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని తెలంగాణలో జరుగుతున్న ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికలలో బిజెపి అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరముందన్నారు. ఆమె వెంట పార్టీ మండల, పట్టణ శాఖ అధ్యక్షులు పీకె వెంకన్న, గుండాల నరేష్, నాయకులు చికిలంమెట్ల అశోక్, మాస శ్రీనివాస్, కూరెళ్ల శ్రీను, పల్లె వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** భువనగిరి మండలంలోని అనంతారం గ్రామంలో మడిపల్లి శ్రీనివాస్ గౌడ్ ఆరోగ్య పరిస్థితి బాగాలేక మరణించారు. ఈ మేరకు ఇలియాస్ మహమ్మద్ వారి కుటుంబాన్ని పరామర్శించి 10000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పక్కిరు కొండల్ రెడ్డి, ఎర్ర శ్రీరామలు, మాజీ ఉపసర్పంచ్ విట్టల్ వెంకటేష్, సల్ల పాండు, పల్లెపాటి రవికుమార్, పల్లెపాటి నరేందర్, మడిపల్లి కృష్ణ, శ్రావణ్, చిగురుపల్లి శ్రీనివాస్, పబ్బల నరసింహ, కుకునూరి మహేందర్, పల్లెపాటి రాజలింగం, శివ పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థి చేయూత



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** తాను చదువుకున్న పాఠశాలకు సేవలందించాలనే ధృక్పదంతో రూ. 15వేల విలువైన కార్యాలయ సామాగ్రిని పూర్వ విద్యార్థి అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్య కమిటీ కార్యదర్శి వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షులు గుండా రమేష్‌లు మాట్లాడుతూ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించేందుకు పూర్వ విద్యార్థులు సహకరించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ రీజియన్ చైర్మన్ మిరియాల సుధాకర్, వాసవి క్లబ్ అధ్యక్షులు ఉప్పల రవి, పివి లక్ష్మీ నారాయణ, డాక్టర్ దండా మురళీధర్ రెడ్డి, కృష్ణ, శ్రీనివాస్, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

## రాజకీయ లబ్ధి కోసమే చంద్రబాబుపై విమర్శలు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** బీఆర్ఎస్ రాజకీయ లబ్ధి కోసమే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుపై విమర్శలు గుప్పిస్తుందని టీడీపీ పట్టణ అధ్యక్షుడు వడ్డెబోయిన శ్రీనివాస్ ఆరోపించారు. చంద్రబాబుపై మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా శనివారం పట్టణంలోని బస్టాండ్ ఎదుట జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వాటాను సీఎం చంద్రబాబు తీసుకెళ్తున్నాడని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. నిబంధన మేరకు నీటిని తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ నాయకులు ప్రజల్లో విశ్వాసం కోల్పోయినప్పుడల్లా తెలుగు దేశం పార్టీ నిందలు మోపడం సిగ్గుచేటన్నారు. ప్రజలు ఓటు అనే వజ్రాయుదంతో బుద్ధి చెప్పినా మార్పు రావడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు చిలకల వెంకన్న, నసీరొద్దిన్‌బాబా, మచ్చ సైదులు, ఉప్పల గోపాలకృష్ణ, ఏచూరి అనంతరాములు, నాగేందర్, శంకర్‌రాజు, ప్రభాకర్, కాంతాచారి, రమేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ, విద్యార్థుల సమస్యలు బిజెపితోనే పరిష్కారం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** ఉపాధ్యాయ, విద్యార్థుల సమస్యలు భారతీయ జనతాపార్టీతోనే పరిష్కారమవుతాయని మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్‌వి ఇంజనీరింగ్ కళాశాలలో భాజపా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిని పులి సర్వోత్తంరెడ్డిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ విద్యా విధానాలను శాస్త్రీయంగా, ప్రస్తుత సాంకేతిక పరిస్థితులకు అనుకూలంగా తీర్చిదిద్దేందుకు కేంద్రంలోని భాజపా ప్రభుత్వం రూపొందించిందన్నారు. ఉపాధ్యాయులు రాబోయే తరాలకు మార్గదర్శిగా ఉండే ప్రభుత్వ ప్రతినిధి భాజపా అభ్యర్థి పులి సర్వోత్తంరెడ్డి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాజపా సీనియర్ రాష్ట్ర నాయకులు తీకుళ్ళ సాయిరెడ్డి, డాక్టర్ మురళీధర్ రెడ్డి, నూనె సులోచన, కృష్ణయ్య, వెంకట శివ, ప్రదీప్, జగతయ్యా, హిందుజా పాల్గొన్నారు.

## రైతు సొమ్ము చోరీ చేసిన నిందితులను పట్టుకున్న అనంతగిరి పోలీసులు



**ప్రజాపక్షం/అనంతగిరి:** రైతు సొమ్ము చోరి చేసి పరారైన నిందితులను చాక్యచక్యంగా వ్యవహరించి పట్టుకున్న సంఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని గొండ్రియాల గ్రామానికి చెందిన కొండబాల పుల్లయ్య అను వ్యక్తి నెలకొండపల్లి వెళ్లి తాను అమ్మిన వరి ధాన్యంకు సంబంధించిన డబ్బులు 1లక్ష 77వేల 817 రూపాయలు తీసుకుని తన టివిఎస్ ఎక్సెల్ బండిపై తిరిగి వస్తుండగా మార్గమద్యలో శాంతినగర్ వద్ద ఎన్‌హెచ్ 365(ఎ) నుండి గ్రామంలో వచ్చు మార్గంలో సర్వీస్‌రోడ్డు వద్దకు వచ్చే సరికి తన వెనకనే ఒక స్కూటిపై ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణానికి చెందిన ఉప్పతల అశోక్‌కుమార్, షేక్ నవాబ్ షరిఫ్, దేవల్లా రాజు అనే ముగ్గురు వ్యక్తులు వచ్చి బాధితున్ని కిందపడేసి అతని వద్ద ఉన్న డబ్బులను లాక్కొని పారిపోయారు. వెంటనే కొండబాల పుల్లయ్య పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయడంతో స్పందించిన అనంతగిరి పోలీసులు చాక్యచక్యంగా వ్యవహరించి సిఐ రజితారెడ్డి పర్యవేక్షణలో అనంతగిరి ఎస్‌ఐ నవీన్‌కుమార్ నిందితులను పట్టుకుని వారి వద్ద ఉన్న నగదును, ఒక స్కూటి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని న్యాయస్థానం ముందు హాజరపర్చారు. ఎస్‌ఐ నవీన్‌కుమార్, కానిస్టేబుల్ వీరబాబు, ఏడుకొండలు, నర్సింహ లను రూరల్ సిఐ రజితారెడ్డి అభినందించారు.

## ఎండుతున్న పొలాలకు శ్రీరామ్ సాగర్ నీళ్లు అందించి కాపాడాలి



**ప్రజాపక్షం/మునగాల:** మునగాల, పెన్‌పహడ్, చివ్వెంల, మోతె మండలాల్లో వరిపైరు సేద్యం చేసిన రైతులు పంట పొలాలు ఎండిపోతుంటే చోద్యం చూస్తున్న నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తక్షణమే ఉత్తిమాటలు కట్టిపెట్టి శ్రీరాం సాగర్ ప్రాజెక్టు ద్వారా సాగు నీళ్లు విడుదల చేసి ఎండిపోతున్న పంట పొలాలను కాపాడాలని బిఆర్ఎస్ నాయకులు ఉడుం కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని వెంకట్రాంపురం, నేలమర్రి గ్రామంలో ఎండిపోతున్న పంట పొలాలను పరిశీలించి మాట్లాడారు. గత కెసిఆర్ ప్రభుత్వ హాయంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగునీళ్లు అందించి సూర్యాపేట జిల్లాలో మెట్ట ప్రాంతంలో వేలాది ఎకరాలు పండించిన రైతులు, నేడు కాంగ్రెస్‌ప్రభుత్వ హాయంలో వేలాది ఎకరాల్లో సేద్యం చేసిన వరిపైరు కళ్లముందే ఎండిపోతుంటే పశువులను, గేదెలను మోపడం చూస్తుంటే రైతుల కంట్లో కన్నీరుకారుతుందన్నారు. ఇప్పటికైనా మంత్రి స్పందించి శ్రీరాంసాగర్ ద్వారా నీళ్లు విడుదల చేసి ఎండిపోతున్న పంట పొలాలను కాపాడాలని కోరారు.




## ఉపాధ్యాయ గొంతుకగా మరోసారి గెలిపించండి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఉపాధ్యాయ గొంతుకగా తనను మరోసారి గెలిపించాలని ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. శనివారం పట్టణంలోని పలు ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి ఓటును అభ్యర్థించి అనంతరం యుటీఎఫ్ భవనంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 30శాతం ఫిట్మెంట్‌తో పీఆర్‌సీ సాధన, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పీఆర్‌సీ ప్రకారం 30శాతం వేతనాలు పెంచడానికి, ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేయించానన్నారు. అదేవిధంగా జూనియర్ లెక్చరర్ల పోస్టుల్లో పదోన్నతులు, డిప్యూటీ వార్డెన్ పోస్టులు మంజూరు, 010 ద్వారా జీతాల పెంపు చెల్లింపుకై కృషి చేస్తానన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు పీఎఫ్ వంటి అమలుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాగమణి, బక్కా శ్రీనివాస్, కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చిన్న వెంకన్న, వేదశ్రీ, ప్రభాకర్, బాలరాజు పాల్గొన్నారు.

## ఘనంగా విద్యా సంబురాలు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని కాకతీయ పాఠశాలలో నర్సరీ నుంచి 5వ తరగతి విద్యార్థులు తమ నైపుణ్యాలతో తెలుగు, హిందీ, ఇంగ్లీష్, గణితం, సైన్స్, ప్రస్తుత పరిస్థితులకు మీద వివిధ రకాలైన తమ బోధనా పాఠ్యాంశాలలోని అంశాలతో ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శించారని పాఠశాల డైరెక్టర్ చీదళ్ల వెంకట్ అన్నారు. ఈ కార్యక్రమానికి చెన్నాయిపాలెం గెజిటెడ్ హెచ్‌ఎం యు.సైదిరెడ్డి, ఉపాధ్యాయులు ఎం.నర్సింహాస్వామి, జి,నర్సింహాలు పాల్గొని మాట్లాడుతూ సృజనాత్మకతతో కూడిన విద్యా విలువలు పిల్లలో అంతర్లంగా దాగి ఉన్ననైపుణ్యాలను బయటకు తీయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడుతాయని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో బాలునాయక్ ప్రత్యేక పూజలు

**ప్రజా పక్షం/పెద్దఅడిశర్లపల్లి:** మండలంలోని యల్లాపురం గ్రామంలో శనివారం నిర్వహించిన శ్రీ సీతారామాంజనేయ స్వామి విగ్రప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో దేవరకొండ శాసనసభ్యులు నేనవత్ బాలునాయక్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందచేసి శాలువాతో ఘనంగా సత్కరించారు.దేవరకొండ నియోజకవర్గం ప్రజలంతా సుఖ సంతోషాలతో పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ఆ సీతారామాంజనేయ స్వామిని ప్రార్థించినట్లు ఈసందర్భంగా ఆయన తెలిపారు.ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుక్కల గోవర్ధన్ రెడ్డి,యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు ముచ్చర్ల ఏడుకొండల్ యాదవ్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లయ్య యాదవ్,వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్మటి సతీష్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బోద్యనాయక్,మాజీ ఎంపీపీ తెర సత్యనారాయణ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ, మండల నాయకులు వెంకటరెడ్డి,మాజీ ఎంపీటీసీ నారాయణ, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేష్ నాయక్ ఉన్నారు.





## బియ్యం అందజేత

**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల పరిధిలోని వెల్మజాల గ్రామానికి చెందిన పాకనాటి నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించారు. మృతుడు నర్సయ్యది నిరుపేద కుటుంబం కావడంతో శనివారం కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు మంద రాములు వారి కుటుంబానికి 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిన్నారులకు ఆశీర్వాదం



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మండల పరిధిలోని గుమ్మడవల్లి గ్రామానికి చెందిన బొడ్డుపల్లి శ్రీశైలం కళమ్మ దంపతుల కుమారులు వినయ్‌కుమార్, వివేకానందల నూతన పట్టువస్త్రాలంకరణ మహోత్సవం శనివారం మండల కేంద్రలోని విజయలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ శుభకార్యానికి ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ హాజరై ఆ చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ డా. వేణుధర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఊట్కురి వేమన్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బొడ్డుపల్లి సైదులు మాజీ ఉప సర్పంచ్ మంగ్యానాయక్, కిన్నెర హరికృష్ణ, మాజీ సర్పంచ్ ఆదిరాల రాము, మిద్దె శ్రీను పాల్గొన్నారు.

## వేంకటేశ్వర స్వామి ఆశీస్సులు ఉండాలి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు ఎల్లప్పుడు దేవరకొండ నియోజకవర్గ ప్రాంత ప్రజల పై ఉండాలని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. శనివారం ఎంఎల్‌ఏ బాలునాయక్ మండల పరిధిలోని గుంటిమడుగు గ్రామంలో నిర్వహించిన శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొని ఆశీస్సులు తీసుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ డా. వేణుధర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఊట్కురి వేమన్‌రెడ్డి, మాజీ ఎంపిపి మేకల శ్రీనివాస్‌యాదవ్, మాజీ సర్పంచ్ మధునాయక్ తదితరులు పాల్గొన్నారు.



## తహసీల్దార్‌కు వినతి



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలంలోని సర్వే నెంబర్ 177లోని 9 ఎకరాల 17 గుంటల భూమి అక్రమంగా కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు తప్పుడు పత్రాలను సృష్టించి భూమిని రిజిస్ట్రేషన్ చేసిని విషయం శుక్రవారం బయటపడడంతో ఇట్టి విషయంపై శనివారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏలూరు రాంరెడ్డి, అఖిల పక్ష నాయకులు, రైతులతో కలిసి స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటి తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నెంబర్ 177లోని 9ఎకరాల 17 గుంటల భూమి విషయంలో అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోని సమగ్ర విచారణ జరపాలని కోరారు. అదే విధంగా మండల వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాలలో ఇదే తరహాలో రియల్ ఎస్టేట్ మాఫియా అక్రమాలకు పాల్పడిందా అనే విషయంపై సమగ్ర విచారణ జరిపి ఇక ముందు ఇలాంటివి కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి అందజేసిన వారిలో వెంకటేషం, సత్తయ్య, రాజు, వెంకన్న, అంజయ్య తదితరులు ఉన్నారు.

## సమస్యల పరిష్కారం కోసం మత్స్యకారులు సంఘటితం కావాలి



**ప్రజాపక్షం/భువనగిరి:** తమ సమస్యలు పరిష్కారం కావాలంటే మత్స్యకారులంతా సంఘటితం కావాలని సహకార భారతి ఫిషరీ సెల్ జాతీయ ఉపాధ్యక్షులు జయదీప్ పాటిల్ అన్నారు. సహకార భారతి ఫిషరీస్ సెల్ రాష్ట్ర బాధ్యులు పిట్టల అశోక్ ఆధ్వర్యంలో శనివారం యాదాద్రి జిల్లా కేంద్రం రాయగిరి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం హాలులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మత్స్యకారులకు సంబంధించి అమలవుతున్న వివిధ పథకాలు, సహకార సంఘాల పనితీరుపై సభ్యులతో చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందుటకు అమలు చేస్తున్న పథకాల గురించి అవగాహన కల్పించారు. చేపల ఉత్పత్తి, ప్రాసెసింగ్, మార్కెటింగ్‌లో విలువ జోడింపు కీలక పాత్ర పోషిస్తుందని వారు అన్నారు. వివిధ రాష్ట్రాలలో మత్స్యకారుల అభివృద్ధి మరియు సంక్షేమము కొరకు సహకార భారతి ఏ విధంగా పనిచేస్తుందో వారు వివరించారు. మత్స్యకారులను సంఘటితం చేసి వారి డిమాండ్ల సాధన కొరకు సహకార భారతి పనిచేస్తుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సహకార భారతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పొన్నాల యాదగిరి, ఫిషరీస్ ఫెడరేషన్ జిల్లా డైరెక్టర్ రవిశంకర్, ముదిరాజ్ సంఘం ఆలేరు నియోజకవర్గ ఇన్చార్జ్ సత్యనారాయణ, అంకర్ల సంజీవ, నర్రా బాలరాజ్, చలిమల రాజు, ఏర్పుల వెంకటేష్, ఉడుత భాస్కర్, ఎర్రోళ్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఉరేసుకుని యువకుడి మృతి



**ప్రజాపక్షం/మోటకొండూర్ :** మోటకొండూరు మండలంలోని అమ్మనబోలుకు చెందిన జెటంగి మహేష్ ఉరివేసుకోని మృతిచెందాడు. తల్లిదండ్రులు మృతునికి ఇటీవల పెళ్ళి కదిర్చినట్లు,పెళ్ళిపై ఆశక్తి లేక శుక్రవారం ఉదయం నుండి కనపడకపోతే తల్లి దండ్రులు ఎక్కడ వెతికినా దోరకలేదని శనివారం ఉదయం స్టోర్ రూమ్‌లో ఉరివేసుకోని మృతిచెందినట్లు తండ్రి కోంరయ్య పిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మోటకొండూర్ ఎస్ఐ ఎన్.ఉపేందర్ తెలిపారు.

**మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత పరామర్శ...**

జటంగి మహేష్ భౌతిక దేహనికి మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి సందర్శించి పూలమాలలువేసి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అనారోగ్యంతో ఇటీవల మరణించిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు క్యాసగల్ల కిష్టయ్య ఆకాల మరణానికి చింతిస్తూ, వారి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ తరపున ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో మదర్ డైరీ మాజీ చైర్మన్ లింగాల శ్రీకర్ రెడ్డి, మోటకొండూరు మండల మాజీ జడ్పిటిసి పల్లా వెంకట్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ బీస కృష్ణంరాజు, సెక్రటరీ జనరల్ ఎర్ర మల్లేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు బీస బిక్షపతి, ప్రధాన కార్యదర్శి కాసుల లవన్ రెడ్డి, యువజన నాయకులు జివిలికపల్లి వెంకటేష్, యువజన అధ్యక్షుడు రేగొండ రాంబాబు, బోట్ల ప్రశాంత్, ఎగమాటి వెంకటరెడ్డి, పోలపాక స్వామి, ఎగమాటి అంజిరెడ్డి, గంగారపు ఆగయ్య, సుదర్శన్, సంగు రాంరెడ్డి, శిగ సాయి, బండి సాయి, మహేష్, కిరణ్ రెడ్డి పాల్గొన్నారు.

## దోశలో బొద్దింక!



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** ఓ వినియోదారునికి ఆకలి వేయడంతో టిఫిన్ చేద్దామని హోటల్‌కి వెళ్ళగా దోషలో బొద్దింక ప్రత్యక్షమైంది. ఈ సంఘటన భువనగిరి పట్టణంలో శనివారం వెలుగులోకి వచ్చింది. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఓ వినియోగదారుడు తనకు ఆకలి వేయడంతో టిఫిన్ చేద్దామని స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న శ్రీ మంజునాథ ఉడిపి హోటల్లో హోటల్కు వెళ్ళాడు. దోషను ఆర్డర్ చేశాడు. దోషను చూడగా బొద్దింక ప్రత్యక్షమైంది. అవాక్కైనా కస్టమర్ వెంటనే హోటల్ యాజమాన్యాన్ని పిలిచి ఇదేంటని ప్రశ్నించాడు. యాజమాన్యం అతనిని బ్రతిమాలి బొద్దింక ఉన్న దోషను బయటకు తీసుకెళ్లినట్లు చెప్పాడు. గతంలో కూడా ఇదే హోటల్లో సాంబార్లో తోక పురుగులు, జరిలు కూడా వచ్చినట్లు వినియోగదారులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు హోటళ్లపై తనిఖీలు చేసి నాణ్యతలు పాటించని యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



## సుందర్ రాజ్ యాదవ్, పూల రవీందర్‌కు బిసి సంక్షేమ సంఘం మద్దతు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఈనెల 27న జరగబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిసి అభ్యర్థులకు మొదటి, రెండవ ప్రాధాన్యత ఓట్లు వెయ్యాలని బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు దుడుకు లక్ష్మి నారాయణ,బిసి రాష్ట్ర ఉద్యమ నేత, మాజీ డిసిఎంస్ చైర్మన్ వట్టే జానయ్య యాదవ్ కొరారు.యదవ సంఘం భవనంలో విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ వరంగల్, ఖమ్మం,నల్లగొండ ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికలలో బిసి అభ్యర్థులను గెలిపించుకోవాలని బిసి, ఎస్సి,ఎస్టి, మైనారిటీల టీచర్లు అందరూ కూడా సమాజంలో మార్పు చేసే దిశలో ఉన్న మీరు రాబోయే తరాల బిసి సమాజానికి మార్గదర్శులు అవుతారు. ఈ సమావేశంలో బిసి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు యాదవ్,బెల్లి నాగరాజు, మునస ప్రసన్న కుమార్, అల్లి సతీష్ యాదవ్, పుట్ట వెంకన్న గౌడ్, సతీష్, మల్లయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సేవలాల్ మహరాజ్ జయంతి



**ప్రజా పక్షం/పెద్దఅడిశర్లపల్లి:** పీఏ పల్లి మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం దగ్గర శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి ఉత్సవాల సందర్భంగా శనివారం బోగ్ బండారో కార్యక్రమాన్ని గిరిజనులు ఘనంగా జరుపుకున్నారు.బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో స్వామివారికి,మాత మేరామా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి కృషి చేసిన వారిలో సేవాలాల్ మహారాజ్ ఒకరన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బోడ్యనాయక్,కార్యదర్శి రామచంద్రనాయక్,మాజీ ఎంపిటిసి నారాయణ నాయక్,గాసీరాంనాయక్,మాజీ సర్పంచి లచ్చిరాం,పాండు నాయక్,చందునాయక్,సీతారాం, భీమానాయక్ యువనాయకులు లక్ష్మణ్ నాయక్,బాలకృష్ణ,రాము, శ్రీరామ్,దస్రు,రఘు,రాజా,ఇస్లావత్ రాజు పాల్గోన్నారు.

## దివ్యాంగుల ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలి : పరశురాం

**ప్రజాపక్షం/గుండాల:** దివ్యాంగులు శరీరానికి అంగవైకల్యం కాని వారి యొక్క మేధాశక్తి విశ్వ జ్ఞానం పొంది ఉంటుందని కరెన్సీ నోటుపై అంబేద్కర్ ఫోటో సాధన సమితి జాతీయ అధ్యక్షులు డా. జేరిపోతుల పరశురామ్ అన్నారు. శనివారం వెల్మజాల గ్రామ పంచాయతీ వద్ద వాయిస్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో దివ్యాంగులు, వృద్దులు, వితంతువులకు దుప్పట్లు, చాపలను, అందులకు స్టిప్స్ వాయిస్ సంస్థ డైరెక్టర్ పి. ఎజ్రా, సిఏపిఎస్ జాతీయ అధ్యక్షులు పరశురామ్ ఆధ్వర్యంలో పంపిణి చేయడం జరిగింది. ఈ సందర్భంగా వాయిస్ సంస్థ డైరెక్టర్ ఎజ్రా మాట్లాడుతూ ప్రార్థించే చేతులకన్నా సేవ చేసే చేతులు మిన్న అని మదర్ థేరిసాను ఆదర్శంగా తీసుకొని సమాజంలో ప్రతి ఒక్కరు సాటి మనిషికి సహాయం చేసినప్పుడే సమాజం అభివృద్ధి పథంలో నడుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ సంగి బాల క్రిష్ణ, సంస్కృతిక సారధి అధ్యక్షులు సంజీవ, దివ్యాంగుల సంఘం నాయకులు రమేష్, వెంకటయ్య, మధు, యాదిరెడ్డి పాల్గొన్నారు.





## సరోత్తమ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు : వినోద్‌కుమార్

**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** బిజెపి బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సర్వోత్తమ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని బిజెపి మండల పార్టీ అధ్యక్షులు మాలోత్ వినోద్ నాయక్ అన్నారు. మండలంలోని తిమ్మాపురం చీకటిమామిడితో పాటు మండలంలోని పలు పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను బిజెపి మండల పార్టీ ఆధ్వర్యంలో కలిసి ఓట్లు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు రాజేందర్ రెడ్డి, జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు మహేష్ గౌడ్, బాలరాజు, ఈశ్వర్ గౌడ్, గుండ్ల గోపాల్, నరసింహా రెడ్డి, భాస్కర్, డాక్టర్ పాండు, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే పరామర్శ



**ప్రజాపక్షం/అడ్డగూడూరు:** మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు వడకల రాంరెడ్డి మాతృమూర్తి రాములమ్మ ఇటీవల మరణించారు. బండ కొముర‌య్య మాతృమూర్తి బండ నర్సమ్మ ఇటీవల మరణించారు. బాలెంల నర్సింహా మాతృమూర్తి బాలెంల సాలమ్మ ఇటీవల మరణించడంతో వారి చిత్రపటాలకు మాజీ ఎమ్మెల్యే డా॥ గాదరి కిశోర్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, అనంతరం లక్ష్మి దేవికాలువ మాజీ సర్పంచ్ చెరుకు సామేలు దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## విధిలేని పరిస్థితిలో ఎస్పిని కలిసిన ఒంటరి మహిళ

**ప్రజాపక్షం/డిండి :** తండ్రి ద్వారా తనకు సంక్రమించిన ఆస్తిని తన అన్న కొడుకులు తనుకు తెలియకుండా స్వాదీనం చేసుకొని, పట్టా చేయించుకొని తనను పట్టించుకోవడం లేదని డిండి మండలంలోని శాంతిగూడెం గ్రామానికి చెందిన ఒంటరి మహిళా అనుబోలు సుశీల తండ్రి పేరెడ్డి శనివారం జిల్లా ఎస్పి శరత్ చంద్రపవార్‌ను కలిసి తనకు న్యాయం చేయాలని బాదితురాలు ఫిర్యాదు చేశారు. తన ఆరోగ్యం బాగున్నన్ని రోజులు ఎలాగో అలాగా కాలం వెల్లబుచ్చానని ప్రస్తుతం తన ఆరోగ్యం సహకరించడం లేదని క్యాన్సర్ తో బాధపడుతున్నానని తెలిపారు. అప్పనంగా తన తండ్రి ద్వారా వచ్చిన భూమిని అనుభవిస్తున్న తన అన్న కొడుకులు తన ఆరోగ్యం పట్టించుకోవడం లేదని అలాంటప్పుడు తన భూమిని తనకు ఇవ్వాలని ఎస్పిని వేడుకుంది. విచారణ చేసి తగిన న్యాయం చేస్తామని ఎస్పి తెలిపారు.



# జంగిటి కైలాసంను గెలిపించాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట:** వరంగల్‌ఖమ్మం నల్లగొండ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి, తెలంగాణ ఉద్యమకారులు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు జంగిటి కైలాసంకు ఉపాధ్యాయులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు రామినేని వెంకటేశ్వర్లు కోరారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా, టియుటిఎఫ్‌ను ఏర్పాటు చేశామని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా గతంలో గెలిచిన వారు ప్రభుత్వంతో కలిసిపోయి ఉపాధ్యాయుల పిఆర్‌సి, డిఎ, బకాయిలను మంజూరు చేయించడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి జంగిటి కైలాసం



మాట్లాడుతూ తనను గెలిపిస్తే ఉపాధ్యాయులు రాష్ట్ర వ్యాప్తంగా ఎదుర్కొంటున్న సమస్యలను శాసన మండలిలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు అంకితభావంతో కృషి చేస్తానని తెలిపారు. బ్యాలెట్ పేపర్‌లో 11 నెంబర్ సిరియల్‌లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. అహ్మద్ అలీ తదితరులు ఉన్నారు.

# శ్రీ స్వయంభు భక్తాంజనేయ స్వామి ఆలయంలో క్షీరాదివాసం



**ప్రజాపక్షం/హాలియా:** హాలియాలోని శ్రీ స్వయంభు భక్తాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలలో భాగంగా నాలుగో రోజు నందివెలుగు శ్రీ బాలాజీ గురుకుల్, త్రీశతాదిక ప్రతిష్టాచార్యుల, రేపల్లె బృందం , సపతి ప్రసాద్ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున తమ ఇంటి ఆడపడుచుల ద్వారా తీసుకొచ్చిన నీటిని జలాధివాసంలో ఉంచిన స్వామికి పోశారు. అదేవిధంగా ద్వారకామాయి భజన మండలి, కూకట్ పల్లి ఆధ్వర్యంలో 108 సార్లు హనుమాన్ చాలిస్ సుమారు ఐదు గంటల సమయం ఆలపించి భక్తులను విశేషం గా ఆకట్టుకున్నారు. హాజరైన సుమారు 4 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రామాలయ కమిటీ చైర్మన్ మేడేపల్లి మోహన్ రావు, గౌరవాధ్యక్షులు కాకునూరి నారాయణ గౌడ్, పారిశ్రామిక వెత్త చిట్టిపోలు యాదగిరి, మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి, ప్రముఖులు ఎడవల్లి నరేందర్ రెడ్డి, కుందూరు వెంకట్ రెడ్డి, కార్యదర్శి వర్కాల సుధాకర్ రెడ్డి, కోశాధికారి రేపాల వెంకన్న, పేలపూడి బాలకృష్ణ,గొని రాజా రమేష్ యాదవ్, వెంపటి శ్రీనివాస్, నిమ్మల లక్ష్మారెడ్డి,వీరమల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఘనంగా స్వపరిపాలన దినోత్సవం





**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వ పరిపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థిని విద్యార్థులు వివిధ రకాల పాత్రలను పోషించారు. కలెక్టర్ మోక్ష, ఎమ్మెల్యేగా జిల్లా దీక్షిత్,డిఈఓగా రఘునందన్ చైతన్య, ఎంఈఓ గా శ్రీజ,ప్రధానోపాధ్యాయులుగా సిలువేరు సతీష్ అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్గా వర్షిత మరియు ఇతరులు ఉపాధ్యాయులుగా తమ పాత్రలను చక్కగా పోషించారు. ఈ స్వ పరిపాలన దినోత్సవంలో ఉపాధ్యాయులు వై. మంజులత, కొండ శ్రీనివాస్, మీనా,అమీనా మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మోతె:** మండలంలోని రావికుంటతండా ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి బోధనలు చేశారు. స్వపరిపాలనలో జిల్లా కలెక్టర్‌గా భూక్య కార్తీక్, జిల్లా విద్యాధికారిగా చేతన్, మండల విద్యాధికారిగా సాహితి, ప్రధానోపాధ్యాయురాలిగా సాహితిలు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్ విజయ, ఉపాధ్యాయులు సిహెచ్ సింహాద్రి, కె సైదులు, ఎస్ఎంసి చైర్మన్ శోభ, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బిసి సమావేశంలో పాల్గొన్న పున్న కైలాస నేత

**ప్రజాపక్షం/మునుగోడు:** టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో బిసినేతలతో సీఎం రేవంత్ రెడ్డి శనివారం హైదరాబాదులో ప్రజాభవన్ లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ కాంగ్రెస్ బిసి నాయకులు, టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పున్న కైలాశ్ నేత పాల్గొన్నారు. జనభా దామాషా ప్రకారం రాబోయే ఎన్నికల్లో బిసిలకు తగిన రిజర్వేషన్లు కల్పించాలని ఆయన కోరారు. సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోనే బడుగు బలహీన వర్గాలకు తగిన న్యాయం జరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం సిఎంను



శాలువతో సన్మానించి మెమెంటో అందజేశారు.

## టాటా ఎస్ బోల్తా : ఒకరు మృతి

**ప్రజాపక్షం/భువనగిరిరూరల్:** హైద్రాబాద్, వరంగల్ జాతీయ రహాదారిపై వాల్ బిల్లలు తీసుకెళ్తున్న కారు బొల్తాపడి ఒకరూ మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. బాదితులు తెలిపిన వివరాల ప్రకారం జోడిమెట్లా నుంచి రాయిగిరిలో సిమెట్ బిల్లలు లోడు తీసుకెళ్తుడంగా భువనగిరి పట్టణంలోని టీచర్స్ కాలని వద్ద మధ్యన ఉన్న డీవైడర్ పైకి వెళ్లడంతో ప్రమాదం జరిగినట్లు తెలిపారు. కాగా మొత్తం నాలుగు ప్రయాణం చేస్తున్న నేపధ్యంలో ఒక బిహార్‌కు చెందిన కులి ముఖేష్కు తీవ్ర గాయాలు అయ్యి మృతి చెందగా, సుకేష్కు తీవ్రగాయాలు మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వైద్యం కోసం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాపు చేస్తున్నట్లు ముఖేక్ మృతదేహానికి పోస్టుమాటం నిమిత్తం బందువులకు అప్పగించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## లయన్స్ క్లబ్ చేయూత



**ప్రజాపక్షం/హాలియా:** ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో పేద విద్యార్థుల సౌకర్యార్థం లయన్స్ క్లబ్ నల్లగొండ స్టార్స్ ఆధ్వర్యంలో లయన్ కీసరి యుగంధర్ రెడ్డి భారతి ల ఆర్థిక సహాయంతో ఇబ్రహీంపేట ప్రాథమికోన్నత పాఠశాలకు 10 డేస్క్ బెంచీలను బహుకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ యడవల్లి అనుపమ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి చెందిన ప్రతి ఒక్కరు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో లయన్ సెక్రటరీ శివ శంకర్ రావు, సింహాద్రి,ట్రెజరర్ టి. మురళీధర్ రెడ్డి, కోఆర్డినేటర్లు కట్ట అనంతరెడ్డి, మార్కెటింగ్ కోఆర్డినేటర్ అలుగుబిల్లి ఆదిరెడ్డి,జోన్ చైర్ పర్సన్ ఫక్కీర్ వెంకట్ రెడ్డి,మాజీ అధ్యక్షుడు కొండ శ్రీనివాస్,కీసరి శ్రీనివాస్ రెడ్డి,ఐతరాజు మోహన్ గుండ్ల అంజిరెడ్డి, లింగాల ప్రభాకర్, ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్యం అందించాలి



**ప్రజాపక్షం/మర్రిగూడ:** వట్టిపల్లి మాజీ సర్పంచ్ ఎడ్ల శ్రీరాములు కుమారుడు ఎడ్ల పవన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. పవన్ ప్రస్తుతం హైదరాబాద్ బియన్ రెడ్డి నగర్ లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ శాసనసభ్యుడు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఆసుపత్రికి చేరుకొని పవన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నాడు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. అనంతరం ఎడ్ల శ్రీరాములు ను పరామర్శించి మనోధైర్యాన్ని ఇచ్చాడు. ఆయన వెంట మాజీ ఎంపిపి మెండు మోహన్ రెడ్డి, మాల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దంటు జగదీశ్వర్, రైతుబంధు సమితి మండల మాజీ కన్వీనర్ బచ్చు రామకృష్ణ, సహకార సంఘం చైర్మన్ బాల నరసింహ, సీనియర్ నాయకుడు వెంకటరమణారెడ్డి ఉన్నారు.

## ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి :** హైదరాబాద్‌లోని బదిరుల శిక్షణ కేంద్రం నిర్వాహకులకు శనివారం మండల విద్యాధికారి ఆర్. నాగేశ్వర్‌రావు స్థానిక జెడ్పిహెచ్ఎస్‌లో రూ. 20వేలను ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుండే సేవాభావం పెంచుకోవాలని అన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లేల జనార్ధన్‌రెడ్డి, కట్టెబోయిన శ్రీనివాసులు, కుమార్, సైదానాయక్, జానునాయక్, బాలాజీ, నాగార్జున, శ్రీనునాయక్, శ్రీధర్, సరస్వతి, నీరజ, విమల పాల్గొన్నారు.



## పన్ను వసూలుపై ఉన్న శ్రద్ధ..
# మున్సిపాలిటీ నిర్వహణపై లేదా సారూ!

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** ప్రతి ఏటా ఇంటి పన్ను వసూళ్లపై ఉన్న శ్రద్ధ మున్సిపాలిటీ నిర్వహణపై లేదాయేనని పోచంపల్లి మున్సిపాలిటీ సగటు పౌరుడు ప్రశ్నిస్తున్నారు. పట్టణ ప్రధాన రహదారి మధ్యలో ఉన్న డివైడర్లలోని విద్యుత్ లైట్స్ స్తంభాలకు పలు ప్రైవేటు వ్యాపారులు అనుమతులు లేని తమ వ్యాపార ప్రకటన బోర్డులు ప్లెక్సీలు, పాఠశాల ప్రకటన ప్లెక్సీలు ఏర్పాటు చేసినప్పటికీ చూసి చూడనట్లుగా వ్యవహరిస్తూ వాటిని తొలగించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ బాధ్యతలు విస్మరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ గత ప్రభుత్వాల అభివృద్ధి పనుల శంకుస్థాపన ఫలకలకు ముసుగులు వేయకుండా అలాగే వదిలివేయడం అధికారుల నిర్లక్ష్యానికి బాధ్యతారాహిత్యానికి పరాకాష్టగా ఉందని ఆరోపణలు చేస్తున్నారు. నెలలు గడుస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్ లైన్లు క్రమంగా శుభ్రం చేయకపోవడం, పట్టణంలోని ప్రధాన వీధులలో వీధి లైట్లు ఫెయిల్ అయినప్పటికీ టెక్నికల్ సమస్యలను పరిష్కరించి కొత్త బల్బులను ఏర్పాటు చేయకపోవడం, డ్రైనేజ్ పైపులైన్ల రిపేర్లలో గుంతలు తవ్వి పూడ్చటం మరవడం, వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నా డాగ్ క్యాచర్ సిబ్బందితో పరిష్కారం చూపకుండా కుక్కల బెడద నుంచి కాపాడలేక పోతున్నారని తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి.నీటి సరఫరా సరిగ్గా లేకపోవడం వేసవి సమీపిస్తున్న మంచి నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టకపోవడం ఇలా అన్ని విభాగాలలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనబడుతుందని సర్వత్రా వినిపిస్తున్న ఫిర్యాదులు.ఇక నూతనంగా నిర్మించుకునే ఇంటి పర్మిషన్ కోసం ఆన్లైన్ చలాన్ ఫీ చెల్లించినప్పటికీ ఇతరత్ర రుసుమలే కాకుండా అక్రమంగా వేలల్లో డబ్బులను డిమాండ్ చేస్తూ వసూలు చేస్తూ అవినీతికి పాల్పడుతున్నారని బాధితులు గగ్గోలు పెడుతూ ఆవేదన చెందుతున్నారు. మున్సిపాలిటీకి సంబంధించి ఏ అనుమతులు కావాలన్నా సిబ్బందికి చేతులు తడపాల్సిందేనని బహిరంగంగా మాట్లాడుకుంటున్నారు. ఇదేమిటని ప్రశ్నించిన వారిని నిబంధనల పేరుతో చెప్పులు అరిగేలా మున్సిపాలిటీ చుట్టూ తిప్పుకుంటున్నారని ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ శృతి మించితే అవినీతి నిరోధక శాఖ వారికి రెడ్ హ్యాండెడ్ గా పట్టిస్తామని కూడా హెచ్చరిస్తున్నారు. పోచంపల్లి మున్సిపాలిటీ సిబ్బంది విధుల నిర్లక్ష్యం విషయం కలెక్టర్ దృష్టికి కూడా వెళ్లినట్లు విశ్వసనీయ సమాచారం. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024/25 మార్చి 31తో ముగియనున్న నేపథ్యంలో మొత్తం డిమాండ్ రూ. 2.12 కోట్లు ఉన్నట్లు ఇప్పటి వరకు 40 శాతంతో రూ 83.35 లక్షలు పన్నులు వసూలు అయినట్లు మున్సిపల్ కమిషనర్ అంజన్ కుమార్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.మిగిలిన 60 శాతం పన్నులు రూ.128.95 పన్నులు ప్రజల నుంచి రావల్సి నట్లు వివరాలు తెలిపారు. ఆస్తి పన్నులు, నీటి పన్నులు ట్రేడ్ లైసెన్స్ ఫీజులు మీ సంబంధిత వార్డు అధికారి వద్ద కానీ లేదా బిల్ కలెక్టర్ వద్ద కానీ లేదా మున్సిపల్ కార్యాలయం ప్రత్యేక కౌంటర్ యందు కానీ చెల్లించి రశీదు పొంది పట్టణ అభివృద్ధి కి సహకరించాలని కోరారు. ఇదిలా ఉంటే అస్తి పన్నుల రూ పేనా గత బిఆర్ఎస్ ప్రభుత్వం గతం కంటే మూడు నాలుగు రెట్లు పెంచి ప్రజల మీద పెనుభారం వేసిందని పైగా సంవత్సరం తర్వా త చెల్లించాల్సిన ఆస్తిపన్నును అడ్వాన్సుగా చెల్లించాలని లేదంటే వడ్డీతో సహా కలుపుకొని చక్రవడ్డీని జోడించి పన్నులు వసూలు చేసేలా కొత్త మున్సిపాలిటీ చట్టం తెచ్చి కొత్త పన్ను స్లాబులతో నడ్డి విరుస్తూ ప్రజలను,వ్యాపారస్తులకు నిలువెల్లా దోచుకుంటున్నారని మనోవేదనకు గురవుతున్నారు.





# నిరుపేద కుటుంబానికి ఆర్థికసాయం

**ప్రజాపక్షం/కూసుమంచి :** మండలంలోని నేలపట్ల గ్రామానికి చెందిన తాటికొండ రేణుకు అనే మహిళ హృదయ సంభంధిత సమస్యను తెలుసుకొని ఆమెకు సహాయంగా భూక్య సురేష్ నాయక్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆమెను పరామర్శించి 50కిలోల బియ్యం మరియు నిత్యవసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో తాటికొండ రేణుక మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి ద్వారా ఆమె శస్త్ర చికిత్సకి అవసరమైన 2.5 లక్షలు సిఎం రిలీఫ్ ఫండ్ అందించినట్లు స్థానిక నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు హఫీజుద్దీన్, కొరివి వెంకటరత్నం, టిపిసిసి అధికార ప్రతినిధి, మంకెన వాసు, ఆత్మ కమిటీ డైరెక్టర్ మంచ్య నాయక్, ఎన్ పీ.చారి, ఆత్మ కమిటీ డైరెక్టర్, చిలకబత్తిని రామారావు, కళ్లెం శేషీ రెడ్డి, బెల్లంకొండ కిరణ్ కుమార్, కొక్కిరేణి రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేణుక త్వరగా కోలుకోవాలని కోరుతున్నారు.



# ఎఓను అన్యాయంగా బలి చేశారు..

**-మాజీ జెడ్‌పిటిసి సూదిరెడ్డి సులక్షణ గోపిరెడ్డి**

**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండల వ్యవసాయ శాఖ అధికారిగా పని చేస్తున్న సాయి శంతన్‌కుమార్‌ను కొంత మంది వ్యాపారస్తులు, వారు చేస్తున్న అక్రమాలకు లొంగట్లేదని, సహకరించట్లేదని, కావాలనే ఏసీబీ కేసులో అక్రమంగా ఇరికించారని దీనిపైన పూర్తి స్థాయిలో విచారణ జరిపి ఒక నిజాయితీపరుడైన అధికారికి న్యాయం చేయాలని అశ్వాపురం మాజీ జెడ్‌పిటిసి సూదిరెడ్డి సులక్షణ గోపిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అశ్వాపురం మండలంలో గత ఆరు సంవత్సరాలుగా మండలంలో ఉన్న రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, పంట సాగుకు, కావలసినటువంటి సలహాలు సూచనలు ఇస్తూ రైతులకు 24గంటలు అందుబాటులో ఉండి స్వయంగా పంట పొలాల సందర్శించి పలు సూచనలు చేస్తూ మండల ప్రజలకు అండగా ఉంటూ, రైతుల మన్ననలు పొందారని తెలిపారు. ప్రతి గ్రామంలో కూడా రైతులకు ఎప్పటికప్పుడు రైతులతో సమావేశాలు, నిర్వహిస్తూ నూతన పద్ధతులు, నూతన వంగడాలపై నూతన సాగు, విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తూ సమావేశాలు నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. క్షేత్రస్థాయిలో వెళ్లి రైతులకు అవగాహన కల్పించడంలో ముందు వరుసలో ఉండి వ్యవసాయ శాఖ అధికారి అంటే ఇలా ఉంటారా అనేలా చేసి రైతుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు సాయి శంతన్‌కుమార్ అటువంటి మంచి అధికారిపై కావాలని కొంత మంది స్వార్థపరులు అన్యాయంగా మండల వ్యవసాయ శాఖ అధికారిని కుట్ర పని బలి చేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి ఆ కుటుంబానికి న్యాయం చేయాలని లేని పక్షంలో రైతులతో కలిసి ఉద్యమిస్తామని అన్నారు.



# అంబోజమ్మ కుటుంబాన్ని పరామర్శించిన కూనంనేని

**ప్రజాపక్షం/అశ్వాపురం:** సిపిఐ సీనియర్ మహిళా నాయకురాలు, నాయకులు గణేషుల అమ్మాజీ అంబోజమ్మ కుటుంబాన్ని కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివ రావు శనివారం పరామర్శించారు. ఈసందర్భంగా అమ్మాజీ అంబోజమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ మంచి నాయకున్ని కోల్పోయిందని అన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు కమటం వెంకటేశ్వరరావు, సిపిఐ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్సీ ఓట్లు అరవై మూడే..

**ప్రజాపక్షం/పెనుబల్లి:** ఉపాధ్యాయ యంయల్ సి ఎన్నికల్లో ఈ నెల 26 పోలింగ్ జరగనుంది. పెనుబల్లి మండలం లో మొత్తం 63 ఓట్లు మాత్రమే ఉన్నాయి. పోలింగ్ కేంద్రం పెనుబల్లి లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల లో ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికలు ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాల పరిధి లోకి వస్తాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 19 మంది రంగం లో ఉన్నారు. యూటీయఫ్ అభ్యర్థి గా నర్సిరెడ్డి రెండోసారి రంగంలో ఉన్నారు, పిఆర్‌టియు అభ్యర్థిగా శ్రీ పాల్ రెడ్డి, బీజేపీ బలపరుస్తున్న పులి సర్వోత్తమ రెడ్డి, మరి కొంతమంది స్వతంత్ర అభ్యర్థులు రంగంలో ఉన్నారు. కేవలం 63 ఓట్లు ఉండటంతో పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రచారం పట్ల అంత ఆసక్తి చూపటం లేదు. స్థానికం గా ఉన్న యూనియన్ నాయకులు ప్రచారం చేస్తుండగా, కొందరు చరవాణి ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఓటు హక్కు ఉండాలి అంటే 2018 నుండి 2024 అక్టోబర్ 31 లోపు జిల్లా పరిషత్ పాఠశాలలో మూడు సంవత్సరాలు పని చేసిన ఉపాధ్యాయలకు మాత్రమే ఓటు హక్కు కలుగుతుందని పలు ఉపాధ్యాయ సంఘాలు తెలుపుతున్నాయి.

# ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించాలి

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఎన్నికల విధులను సక్రమంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శనివారం ఐడిఓసి కార్యాలయ సమావేశమందిరంలో ఈనెల 27న జరగనున్న ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల పిఓ, ఏపిఓలకు రెండో విడత శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది పోలింగ్ పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ముందురోజే సిబ్బంది పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకోవాలని, సామాగ్రి అంతటిని పరిశీలించుకోవాలన్నారు. 26వ తేది ఉదయం కొత్తగూడెంలోని రామచంద్ర ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో ఎన్నికల సామాగ్రి పంపిణీ ఉంటుందని చెప్పారు. కార్యక్రమం లో దారా ప్రసాద్, పూసపాటి సాయికృష్ణ, కిరణ్ కుమార్, అశోక్, నవీన్ పాల్గొన్నారు.



# విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

**ప్రజాపక్షం/భద్రాచలం :** గిరిజన విద్యార్థులకు మెరుగైన వసతి సౌకర్యాలు అదించేందుకు చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. శనివారం మణుగూరు సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదుల పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ విద్యార్థినీలకు ఇబ్బందులు తలెత్తకుండా నిర్మాణాలు ఉండాలని, వర్షపునీరు నిలవకుండా చూడాలన్నారు. రూ.1 కోటి 80 లక్షల వ్యయంతో చేపడుతున్న తరగతి గదుల నిర్మాణాలు ఆరు మాసాల్లో పూర్తికావాలన్నారు. అదే విధంగా పోలీస స్టేషన్‌లో నిర్మాణం అవుతున్న కౌన్సిలింగ్ హాల్‌ను పరిశీలించి ఒక నెలలో పూర్తి చేయాలన్నారు. అనంతరం బిపిఎస్ పాఠశాలను సందర్శించి ఉద్దీపకం వర్క్‌బుక్స్‌కు సంబంధించిన పాఠ్యాశాలను విద్యార్థులు ఏ విధంగా చదువుతున్నది అడిగి తెలుసుకున్నారు. బోర్డు పై లెక్కలు చేయించారు. విద్యార్థులు లెక్కలు, ఇంగ్లీ,షలలో వెనుకబడి ఉండటాన్ని గమనించిన ఆయన ఉపాధ్యాయులు చొరవతీసుకుని బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఇ చంద్రశేఖర్, డిఇ మధుకర్, ఏఇలు ప్రసాద్, యోగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ఎఫ్‌ఎల్‌ఎన్ బాలమేళా

**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రాథమిక స్థాయిలో విద్యాబలోపేతం కోసం జరుగుతున్నటువంటి బాల మేళా కార్యక్రమం ఆళ్లపల్లి కాంప్లెక్స్ స్థాయి సమావేశం స్థానిక ఎంపీపీఎస్ లక్ష్మీపురం పాఠశాల నందు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆళ్లపల్లి కాంప్లెక్స్‌లోని అన్ని పాఠశాలలు పాల్గొన్నారు. గత వారం బాలమేళా కార్యక్రమంలో భాగంగా ఎంఈవో శాంతారావు, అసిస్టెంట్ సెక్రటరీ ఇస్లావత్ హాథిరాం, ఎఫ్‌ఎల్‌ఎన్ బాలమేళా ఆర్పీ శ్రీనివాసరావు ,మండల ఆర్పి మోహన్‌బాబు వారం రోజుల పాటు అన్ని పాఠశాలలను సందర్శించి ఆయా పాఠశాలల యొక్క పరిస్థితులను విద్యార్థులు యొక్క ప్రమాణాలను విసిట్ చేసి పాఠశాలల్లో గ్రేడులుగా విభజించారు. ఇందులో ఎంపీపీఎస్, ఎంపీపీఎస్ ఆళ్లపల్లి పాఠశాల, రామంజిగూడెం, పాతూరు, లక్ష్మీపురం వలసల, పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈకార్యక్రమానికి మర్కోడ్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా జోగా రాంబాబు, అగ్గి రామకృష్ణ, పూణేం సమ్మక్కలు పాల్గొన్నారు. ఈకార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంఈవో శాంతారావు మాట్లాడుతూ ప్రాజెక్ట్ పనుల ద్వారానే విద్యార్థుల్లో దాడి ఉన్నటువంటి నైపుణ్య శక్తిని వెలికి తీయవచ్చని అన్నారు. ఆ విధంగా విద్యార్థులు అందరూ చదివిపై స్థాయికి వెళ్లాలని అందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని తల్లిదండ్రుల సహకారం అందించాలని అందరినీ కోరారు.

